# ఉప్పెనలా తరలిరావాలి



మద్దూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అభివాదం తెలుపుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి
- నేను ఈ ప్రాంతపు మట్టి బిడ్డనే..
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు
- పెద్దఎత్తున హాజరైన నాయకులు, కార్యకర్తలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 13 : ఈ నెల 16న జనగామలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు ఉప్పెనలా తరలిరావాలని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ మండల శాఖల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి పల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో జనగామ, చేర్యాల ప్రాంతాలు సీఎం కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ వంద సీట్లలో విజయం సాధిస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. పదేండ్ల కింద తెలంగాణ ఎట్లుండే.. ఇప్పుడెట్లా ఉందో చూడాలన్నారు. ఒకనాడు 24లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన తెలంగాణలో ప్రస్తుతం 3కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందన్నారు. ప్రపంచంలోని 20 ప్రభావమైన పథకాలలో రైతుబంధు, రైతుబీమా పథకాలు నిలుస్తాయన్నారు. కాంగ్రెస్‌ది టికెట్లు అమ్ముకునే సంస్కృతి ఉందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మరన్నారు. జనగామ, చేర్యాల, ధర్మసాగర్ ప్రాంతాలు ఒకనాడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉండేవని పల్లా అన్నారు. నేను ఈ ప్రాంతపు మట్టి బిడ్డనే. ఈ ప్రాంతపు కష్టాలు నాకు పూర్తిగా తెలుసు. సీఎం కేసీఆర్ ఆదేశాలు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చినట్లు తెలిపారు. తనపై చిల్లరమల్లర విమర్శలు చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దమ్ముంటే సిద్ధాంతపరంగా లేదా సేవ చేయడంలో పోటీపడాలన్నారు. రేవంత్‌రెడ్డికి డబ్బులు, భూములిచ్చి టికెట్ తెచ్చుకుంటున్నట్లు విమర్శించారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తన ఎమ్మెల్సీ నిధుల నుంచి మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు రూ.60లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

**'పల్లా'ను భారీ మెజార్టీతో గెలిపించాలి**

జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మద్దూరు మాజీ జడ్పీటీసీ జల్లి సిద్దయ్య అన్నారు. రాజేశ్వర్‌రెడ్డి గెలిస్తే జనగామ సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గలతో అభివృద్ధిలో పోటీపడుతుందన్నారు. జనగామ ప్రాంత ప్రజలు చైతన్యవంతులన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు వంగ భాస్కర్‌రెడ్డి, చొప్పరి వరలక్ష్మీసాగర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, మద్దూరు, ధూళిమిట్ట సర్పంచులు కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఖాజా ఆరీఫ్, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# మన బలగం, బలం సీఎం కేసీఆర్



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- నాపై నమ్మకంతో సీఎం కేసీఆర్ జనగామకు పంపారు..
- ఆశీర్వదించండి.. సేవ చేస్తా
- గజ్వేల్, సిద్దిపేట తరహాలో జనగామను అభివృద్ధికి కృషి
- సంక్షేమం, అభివృద్ధిలో పోటీపడాలి
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- సీఎం సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపు

బచ్చన్నపేట, అక్టోబర్ 13 : సీఎం కేసీఆర్ తనపై ఉన్న నమ్మకంతో జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపారని, మీరు ఆశీర్వదించి గెలిపిస్తే సేవ చేస్తానని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని శాసనమండలి మాజీ చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనిధి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగామలో మూడు రోజుల క్రితం జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో వేలాది మంది పాల్గొని తనకు ఎంతో తోడ్పాటు అందించారన్నారు. సభ సక్సెస్ ఎంతో సంతోషాన్నించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో 10 రోజులు జైల్లో ఉన్నానని, 11 కేసులు, 18 సెక్షన్‌లు పెట్టారని గుర్తుచేశారు. ఉద్యమ ద్రోహి అని కాంగ్రెస్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. బచ్చన్నపేటకు ఎక్కువ అభివృద్ధి నిధులు కొట్లాడి తెచ్చి చేయూతనిస్తానన్నారు. బీఆర్ఎస్‌లో కుదిరిన సయోధ్య, ఐక్యతను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. మన బలగం, బలం సీఎం కేసీఆర్ అని అన్నారు. మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, దయాకర్‌రావు సలహాలు, సూచనలు తీసుకుంటూ, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. ఈ నెల 16న జనగామలో నిర్వహించే సీఎం సభకు వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి జనగామ సత్తాచాటాలన్నారు.

మాజీ చీఫ్‌విప్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు ఎంతో సాన్నిహిత వ్యక్తి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ నుంచి పోటీ చేయించడం మన అదృష్టమన్నారు. స్థానికుడు కాదని అనే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జనగామలో రెండుసార్లు గెలిచిన ముత్తిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ ఇచ్చి గౌరవించారన్నారు. జనగామకు సరైన నాయకుడు పల్లా అన్నారు. కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. రైతు రుణమాఫీ కొందరికి పడడం లేదన్నారు. రాజేశ్వర్‌రెడ్డి బ్యాంకర్లతో మాట్లాడి పంట రుణమాఫీ అయ్యేలా కృషి చేయాలన్నారు. పంట నష్టపరిహారం కూడా అందజేయాలన్నారు.

## పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

- తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకోవాలి
- బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13 : నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు జరుగనున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తెలంగాణ ఆడపడుచులకు మంత్రి హరీశ్‌రావు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఎంగిలి పూలతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు తీరొక్క రంగులతో జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా జిల్లా ఆడపడుచులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు, ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని.. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ గొప్ప పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అభివృద్ధికి చిరునామా | ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

# హుస్నాబాద్ నియోజకవర్గం



ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సైదాపూర్ మండల బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 13 : అభివృద్ధికి చిరునామాగా హుస్నాబాద్ నియోజకవర్గం మారిందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం సైదాపూర్ మండలానికి చెందిన 30 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై పార్టీలో చేరడం అభిందనీయమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతున్నదన్నారు. తెలంగాణలో బలమైన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కార్యక్రమంలో సైదాపూర్ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు సోమారపు రాజయ్య ఉన్నారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా ఉంటా




హుస్నాబాద్‌లో జరిగిన ట్రస్మా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

- మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 13 : ప్రైవేట్ ఉపాధ్యాయులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తనను ఆశీర్వదించాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం శుక్రవారం హుస్నాబాద్‌లోని కేజీఆర్ గార్డెన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మంచి వ్యక్తులను తయారు చేస్తున్న ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదన్నారు. విద్యాలయాల ఏర్పాటులో ఎన్నో ఇబ్బందులు ఉంటాయని, అయినప్పటికీ నిలదొక్కుకుంటూ సమాజానికి మేలు చేసేందుకు నిరంతరం పాటుపడుతున్నారని ప్రశంసించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లు కోసం 2018పార్లమెంట్ సమావేశాల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కృషిచేశారని, కానీ బిల్లు అమలు కాలేదన్నారు. నియోజకవర్గంలో ట్రస్మాకు సొంత స్థలం కేటాయించేందుకు కృషిచేస్తానని తెలిపారు. బీసీ, మైనార్టీ, దళితబంధు అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు బీమా సౌకర్యం, హెల్త్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో ట్రస్మారాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినీ, ట్రస్మా నియోజకర్గ అధ్యక్షుడు కాయిత నారాయణరెడ్డి, కోశాధికారి కాశిరెడ్డి ఆదిరెడ్డి, జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ బుర్ర రాజేందర్, శైలేందర్, కాయిత శ్రీధర్‌రెడ్డి, కామని రవీందర్, విజయకుమార్‌రెడ్డి, చెప్యాల గోపాల్‌రెడ్డి, బేర యాదగిరి, నడిపెల్లి సుధీర్‌కుమార్, అనంద్, కొండ బత్తిని రాజేశం, అచ్చ అశోక్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.